సాక్షి అనకాపల్లి

గురువారం । 3 । జూలై । 2025



పరశురామావతారం

కశింకోట: రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథస్వామి బుధవారం పరశురాముని అవతారంలో దర్శనమిచ్చారు.



విశాఖ చరిత్రలో మైలురాయి

క్రూయిజ్ షిప్ విశాఖ–చెన్నై సర్వీస్‌ను వర్చువల్ విధానంలో కేంద్ర మంత్రి సోనోవాల్ ప్రారంభించారు. 8లో



తిరునక్షత్రం పూజలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం పెరియాళ్వార్ తిరునక్షత్రం పూజలు విశేషంగా జరిగాయి.

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌వోగా హైమావతి



అనకాపల్లి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎం.హైమావతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖలోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఆర్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆమెను సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ నియమించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా పనిచేసిన కె.బాలాజీ తన మాతృ సంస్థ అయిన జిల్లా లెప్రసీ విభాగానికి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.హైమావతి మాట్లాడుతూ జిల్లాలో వివిధ మండలాల్లోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలను పరిశీలించి అక్కడ రోగులు, ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వర్షాలు పడుతున్న కారణంగా గ్రామీణ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.

నూకాంబిక ఆలయ ఈవోగా సుధారాణి



అనకాపల్లి: స్థానిక గవర పాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ ఇన్‌చార్జ్ ఈవోగా కె.ఎల్.సుధారాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దేవదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెకు నూకాంబిక అమ్మవారి ఆలయ ఇన్‌చార్జ్ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఈవో వెంపలి రాంబాబు జూన్ 30న ఉద్యోగ విరమణ చేశారు.

పాయకరావుపేట హాస్టల్‌ను పరిశీలించిన అధికారులు



వివరాలు తీసుకుంటున్న అధికారి

పాయకరావుపేట: హోం మంత్రి భోజనంలో బొద్దింక వచ్చిన బీసీ బాలికల కాలేజి హాస్టల్‌ను ఆర్డీవో వి.వి.రమణ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ జయంతి బుధవారం పరిశీలించారు. సోమవారం రాత్రి వసతి గృహాన్ని సందర్శించి, బాలికలతో కలిసి భోజనం చేసి, నాణ్యత దారుణంగా ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. నిర్లక్ష్యం వహించిన వసతి గృహం వార్డెన్ గంగభవానీని సస్పెండ్ చేశారు. జిల్లా అధికారులు బుధవారం హాస్టల్‌కు వెళ్లి మెనూ అమలు, రైస్ నాణ్యత, తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సస్పెన్షన్‌కు గురైన వార్డెన్ గంగభవానీని కూడా వివరణ అడిగినట్లు తెలిపారు. విచారణ రిపోర్టును జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామని చెప్పారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేష్ పాల్గొన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడు గల్లంతు



యర్రయ్య(ఫైల్)

అచ్యుతాపురం రూరల్: పూడిమడక గ్రామానికి చెందిన మత్స్యకారుడు చోడిపల్లి యర్రయ్య(26) సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం నలుగురితో కలిసి యర్రయ్య సముద్రంలో వేటకు వెళ్లాడు. చేపలు పట్టడం కోసం తాడును చేతికి కట్టుకుని గేలంతో చేపలను కొట్టాడు. ఈ క్రమంలో ఈ గేలానికి సుమారు 100 కేజీల బరువు ఉండే పెద్ద చేప చిక్కుకుంది. అయితే ఆ చేప బలంగా సముద్రంలోకి లాక్కుపోవడంతో యర్రయ్య గల్లంతైనట్టు తోటి మత్స్యకారులు తెలిపారు. తీరానికి సుమారు 50 నుంచి 60 కిలోమీటర్ల దూరంలో వేట సాగించామన్నారు. అధికారులు స్పందించి గల్లంతైన మత్స్యకారుడి కోసం గాలించాలని మత్స్యకార నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు కోరారు.



రోలుగుంటలో ఎంపీడీవో కార్యాలయం కూడలి నుంచి ఎంపీపీ పాఠశాల వరకు భారీ గుంతలో చేరిన వర్షం నీరు



రోలుగుంట పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఎన్నో ప్రమాదాలకు కారణమైన గుంతలు



భారీ వర్షంలో మేడివాడ రోడ్డు దుస్థితి



రోలుగుంట విద్యుత్ కార్యాలయం సమీపంలో ప్రమాదకరంగా మారిన గుంతలు

నూతులు కాదు.. గోతులే..

రహదారుల రూపురేఖలు మార్చేస్తామని పెద్ద కబుర్లు చెప్పారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు ఇదే జిల్లాలో పరవాడకు వచ్చి హామీ ఇచ్చారు. కొత్త రోడ్లు కూడా వేస్తామన్నారు. ఐదు నెలలు పూర్తయినా జిల్లాలో ఎక్కడి గుంతలు అక్కడే ఉన్నాయి. ఇటీవలి వర్షాలతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రాణాంతకంగా తయారయ్యాయి.



దొండపూడి శివాలయం ఎదురుగా నూతిని తలపిస్తున్న గొయ్యి

- మృత్యుకుహరాలుగా మారిన రహదారులు
- దయనీయంగా నర్సీపట్నం-చోడవరం రోడ్డు
- సుమారు 48 కి.మీ మేర లెక్కలేనన్ని గుంతలు
- ఇదే రహదారిలో 30కి పైగా రోడ్డు ప్రమాదాలు
- వర్షపు నీరు గుంతల్లో చేరి ప్రమాదకర పరిస్థితి
- సంక్రాంతికి గోతులు లేని రహదారులుగా తీర్చిదిద్దుతామని సీఎం ప్రకటన
- ఐదు నెలలు దాటినా అదే దుస్థితి

సాక్షి, అనకాపల్లి:

జిల్లాలో నర్సీపట్నం నుంచి రోలుగుంట, కొత్తకోట, రావికమతం, కోమళ్లపూడి, వడ్డాది, చోడవరం, వెంకన్నపాలెం మీదుగా గంధవరం వరకు సుమారు 48 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు ప్రమాదభరితంగా ఉంది. అడుగుకో గొయ్యి ఏర్పడి.. వర్షపు నీటితో నిండిపోయి ఏది రోడ్డో, ఏది గుంతో తెలియక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో ఆ గుంతలు కాస్త పెద్ద పెద్ద నూతులుగా మారాయి. రాత్రి సమయంలో ఆ రోడ్డుపై వాహనదారులు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అడుగడుగునా నరకయాతన పడుతున్నారు. ఓ మాదిరి వర్షం పడిందంటే చాలు ఆ గోతుల్లో నీళ్లు చేరి రోడ్డంతా జలమయం అవుతుంది. అదేవిధంగా మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాల్లో ఉన్న గిరిజన గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి కూడా అదే మాదిరి మారింది. దేవరాపల్లి నుంచి గిరిజన పంచాయతీ వాలాబు వెళ్లే రోడ్డుపై సుమారు 10 కిలోమీటర్ల మేర అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు పూర్తిగా శిథిలమవ్వడంతో సుమారు 14 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదాల రహదారి

గంధవరం నుంచి వెంకన్నపాలెం, చోడవరం, విజయరామరాజుపేట, వడ్డాది, కోమళ్లపూడి, రావికమతం, కొత్తకోట, రోలుగుంట వరకు 48 కిలోమీటర్ల మేర ప్రయాణించే వారు నరకం చూస్తున్నారు. 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్‌తో (60:40) ఈ రోడ్డుకు రూ.112 కోట్లు మంజూరు చేశారు. టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్‌కు కాంట్రాక్ట్ అప్పగించారు. రోడ్డుకు ఇరుపక్కల ఏడు అడుగుల మేర విస్తరించి కొత్త రోడ్డు నిర్మాణం చేయాలి. ఈ రోడ్డులో వడ్డాది, విజయరామరాజుపేట, గోవాడ వద్ద మూడు వంతెనలున్నాయి. ఇవి కూడా వేయలేదు. రోడ్డుకు ఇరువైపుల తవ్వేయడంతో వాహనదారులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నికలకు ముందు రూ.3 కోట్లతో కోమలపూడి నుంచి బంగారుమెట్ట వరకు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపుల విస్తరణ పనులు చేశారు. కాంట్రాక్టర్ మిగతా 44 కిలోమీటర్లు రోడ్డు వేయకుండా వదిలేశాడు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా నిలిచిపోయిన ఈ రోడ్డులో అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తన సొంత నిధులు రూ.1.60 కోట్లతో సుమారు ఒక కిలోమీటర్ మేర సీసీ, బీటీ రోడ్లను వేయించారు. చోడవరం టౌన్ ప్రారంభంలో బల్క్‌మిల్క్ సెంటర్ నుంచి కొత్తూరు జంక్షన్ వరకు ఏడు అడుగులు విస్తరించి, రోడ్డు నిర్మాణం చేశారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తాము అధికారంలోకి వస్తే ఏడాదిలోపే ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా అలానే ఉంది. ఇటీవల కాలంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి మృత్యుకుహరాలుగా మారాయి. ఈ గోతుల్లో 30 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. 40 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. రావికమతం నుంచి కొత్తపేట, బుచ్చెయ్యపేట మార్గంలో చిన్నపాటి ప్యాచ్ వర్క్ మినహా కూటమి ప్రభుత్వంలో చేసిందేమీ లేదు.

అధ్వానంగా దేవరాపల్లి-వాలాబు రోడ్డు

దేవరాపల్లి నుంచి సుమారు 10 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డులో అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు పూర్తిగా శిథిలమవ్వడంతో 14 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ మార్గంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి ఒళ్లు హూనమవ్వడంతోపాటు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. వాలాబు పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణానికి మెటీరియల్స్‌ను అధిక లోడుతో ఈ రోడ్డు మీదుగా తీసుకెళ్లడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

జీవనోపాధి కోసం తప్పలేదు..



వర్షం పడినప్పుడు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే భయంగా ఉంది. ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ రోడ్డు ఉందో తెలియడం లేదు. మాకు అలవాటైన రోడ్డు కావడంతో నెమ్మదిగా వెళుతున్నాం. ఈ రోడ్డులో బేరం కడితే మాకు వచ్చే డబ్బుల కన్నా ఆటో మరమ్మతులకే ఎక్కువవుతున్నాయి. జీవనోపాధి కోసం తప్పడం లేదు.

– మద్దు కృష్ణ, ఆటో డ్రైవర్, కె.నాయుడుపాలెం

రోడ్లు కాదు చెరువులే..



రోలుగుంట–గంధవరం బీఎన్ రోడ్డులో ప్రయాణం చేయాలంటేనే భయంగా ఉంది. ఈ రోడ్డు వేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టలేదు. కార్ల ఇంజిన్లు గుంతల్లో ఇరుక్కుపోతున్నాయి. గుంతల్లో నీరు చేరడంతో బైక్ మీద వెళ్లాలంటే చాలా భయంగా ఉంది. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

– పద్మనాభుని తాతాజీ, మెడికల్ స్టోర్ యజమాని, రోలుగుంట

తొలి అడుగు.. సమస్యల మడుగు..

- లంకవానిపాలెంలో ఎమ్మెల్యే బండారుకు సమస్యలు వివరించిన బాధితులు
- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో సమస్యల వెల్లువ



గ్యాస్ డబ్బులు, అన్నదాత సుఖీభవ నగదు రాలేదని ఎమ్మెల్యే బండారుకు తెలుపుతున్న రాము, అప్పలనాయుడు

కె.కోటపాడు: తెలుగుదేశం పార్టీ బుధవారం ప్రారంభించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో నాయకులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడ్డాక ఏడాది కాలంలో మూడు గ్యాస్ సిలిండర్లను విడిపించినా ఒక్క రూపాయి కూడా తన ఖాతాలో పడలేదని లంకవానిపాలెం గ్రామానికి చెందిన నొడు రాము అనే మహిళ తెలిపారు. ఈ గ్రామంలో బుధవారం నిర్వహించిన 'తొలి అడుగు' కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన బండారుకు గ్యాస్ సిలిండర్ల నగదు రాలేదని రాము ఫిర్యాదు చేశారు. అదే కుటుంబానికి చెందిన రైతు అప్పలనాయుడు తనకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సహాయం రాలేదని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సహాయాన్ని ఇవ్వనున్నట్లు బండారు నచ్చచెప్పారు.

గ్యాస్ ఏజెన్సీకి రాము సమస్య తెలిపి పరిష్కార చర్యలను తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామానికి చెందిన మహిళ ఇమంది కనక మహాలక్ష్మి తాను విమ్స్ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేయడం వలన తన భర్త చనిపోయినా వితంతు పింఛన్ రాలేదని, తన ఇద్దరు ఆడపిల్లలకు 'తల్లికి వందనం' డబ్బులు రాలేదని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామంలో ఆయిల్ మిల్లు ఖాళీ స్థలం అన్యాక్రాంతం కాకుండా, గ్రామ అవసరాలకు వినియోగించుకునేలా చూడాలని కొరుపోలు దేముడమ్మ, చిన్నమ్మలు, రామకృష్ణ ఎమ్మెల్యే కోరారు. గ్రామానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు ఎండోమెంట్ భూమిగా రికార్డులలో ఉన్న ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు. ఎండోమెంట్ అధికారిని రప్పించి ఈ సమస్యపై మాట్లాడనున్నట్లు వీరికి ఎమ్మెల్యే బండారు తెలిపారు. రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపురంలో..



పాయకరావుపేట: సీతారాంపురం గ్రామంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె కొన్ని ఇళ్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో తారురోడ్డు పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. దివీస్ కంపెనీ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి వాటర్ ప్లాంట్‌ను, రూ.10 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన సీసీ కల్వర్ట్‌ను ప్రారంభించారు.

వైద్యం ప్రైవేటీకరణే కూటమి లక్ష్యం

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ
- అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాల భవనాల పరిశీలన



అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాల భవనాలను పరిశీలిస్తున్న అజశర్మ, తదితరులు

మాకవరపాలెం: వైద్యాన్ని ప్రైవేటుపరం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ఆరోపించారు. మండలంలోని భీమబోయినపాలెం వద్ద గత ప్రభుత్వం 52.15 ఎకరాల్లో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కళాశాల భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాల భవనాలను బుధవారం అజశర్మ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు ఇక్కడ నిర్మించే వైద్య కళాశాల ద్వారా మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రస్తుతం వీరంతా విశాఖలోని కేజీహెచ్‌కు వ్యయ, ప్రయాసలకోర్చి వెళ్లాల్సి వస్తోందన్నారు. అందుకే గత ప్రభుత్వం వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం వాటిని ప్రైవేటుపరం చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రతిపాదన చేసి నిర్మాణాలను అర్ధంతరంగా నిలిపివేశారని ఆయన విమర్శించారు. ఒక్క పాడేరు కళాశాల తప్ప, మిగిలిన కళాశాలల భవనాల నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం వద్ద కళాశాల భవన నిర్మాణాలు ఆపివేసి, సామగ్రిని అమరావతికి తరలించారన్నారు. తక్షణం కళాశాల నిర్మాణాన్ని ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే అన్నీ పూర్తి చేసుకున్న విజయనగరం కళాశాలను ప్రైవేటుపరం చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమర్థంగా రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ

- ఎస్పీ తుహిన్ సిన్హా
- కొత్తగా 16 ఆధునిక వాహనాలు ప్రారంభం



జెండా ఊపి కొత్త ద్విచక్ర వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆధునిక మోటారు సైకిళ్లను అందుబాటులోకి తీసుకొచ్చామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు 16 కొత్త ద్విచక్ర వాహనాలను స్థానిక మెయిన్ రోడ్డులోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్, 15 టీవీఎస్ అపాచీ ద్విచక్ర వాహనాలను రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం కేటాయించామన్నారు. ఈ వాహనాలను సైరన్, బ్లింకర్లు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, క్రౌడ్ కంట్రోల్ టెక్నాలజీతో ప్రత్యేకంగా రూపొందించామన్నారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాలు, రోడ్డు ప్రమాదాలు జరిగే సమయాల్లో ట్రాఫిక్ పోలీసులు వీటి సహాయంతో తక్షణమే చేరుకునే అవకాశం కలుగుతుందన్నారు. నాలుగు చక్రాల వాహనాలు వెళ్లలేని మారుమూల ప్రాంతాలకు కూడా పోలీసులు సత్వరం చేరుకునేలా ఈ మోటారు సైకిళ్లు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఏఎస్పీ ఎల్.మోహనరావు, డీఎస్పీలు శ్రావణి, డీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, పట్టణ ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చికెన్ @150

మాంస ప్రియులకు నోరూరించే వార్త

- భారీగా పడిపోయిన ధర
- పూరి రథోత్సవాలతో డిమాండ్ తగ్గడమే కారణం



అనకాపల్లి టౌన్: మాంసాహార ప్రియులకు పండగే పండగ. చికెన్ ధర గణనీయంగా తగ్గింది. బుధవారం జిల్లాలో డ్రెస్డ్ కోడి మాంసం రూ.150లకు, స్కిన్‌లెస్ రూ.160లకు విక్రయించారు. ఆదివారం వచ్చిందంటే చికెన్ ముక్క లేనిదే చాలామందికి ముద్ద దిగదు. పిల్లల దగ్గర నుంచి పెద్దవారి వరకు ఎక్కువగా చికెన్ మాంసాన్ని ఇష్టపడతారు. ప్రొటీన్ శాతం ఎక్కువ ఉంటుందని వైద్యులు సైతం మేక మాంసం కంటే కోడి మాంసం మేలని చెబుతారు. ధర కూడా మేక మాంసం కంటే తక్కువ ఉండడంతో చాలామంది ఇళ్లలో చికెన్‌కే ప్రాధాన్యం. సాధారణంగా ఈ రోజుల్లో కేజీ చికెన్ ధర రూ.200 నుంచి రూ.250 మధ్య ఉంటుంది. కానీ మంగళ, బుధవారాల్లో లైవ్ చికెన్ రూ.90, డ్రెస్డ్ రూ.150, స్కిన్‌లెస్ రూ.160లకు లభించింది. గత వారం రూ.200 దాటిన కేజీ చికెన్ ధర ఇప్పుడు ఒక్కసారిగా తగ్గిపోయింది. ఆరా తీయగా పూరి జగన్నాథస్వామి ఉత్సవాల ప్రభావమే కారణమని తెలిసింది. అనకాపల్లి జిల్లా నుంచి ఒడిశా రాష్ట్రానికి బ్రాయిలర్ కోళ్లు ఎక్కువగా ఎగుమతి అవుతాయని, ప్రస్తుతం రథోత్సవం అనంతరం 10 రోజులపాటు వేడుకలు జరగడంతో డిమాండ్ గణనీయంగా తగ్గిపోయిందని హోల్‌సేల్ వ్యాపారులు తెలిపారు. జిల్లాలో కూడా దాదాపు అన్ని చోట్ల జగన్నాథస్వామి ఉత్సవాలు జరుగుతున్నాయి. మారు రథయాత్ర జరిగే వరకు పరిస్థితి ఇలాగే ఉంటుందని చెబుతున్నారు.

క్లుప్తంగా

స్పెషల్ ఒలింపిక్ వాలీబాల్ పోటీల్లో గణేష్ ప్రతిభ



గణేష్‌ను అభినందిస్తున్న సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి జయప్రకాష్

అనకాపల్లి: దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించి వారిలో నైపుణ్యాలను ఉపాధ్యాయులు వెలికి తీస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఆర్.జయప్రకాష్ అన్నారు. జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ యూనిఫైడ్ వాలీబాల్ పోటీల్లో గెలుపొంది కాంస్య పతకం సాధించిన మానసిక దివ్యాంగ విద్యార్థి అప్పికొండ గణేష్‌ను సమగ్ర శిక్ష కార్యాలయంలో ఆయన అభినందించారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో గత నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ యూనిఫైడ్ వాలీబాల్ పోటీల్లో రావికమతం మండలానికి చెందిన గణేష్ రాణించాడన్నారు. జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి ఎల్.గిరిధర్ తదితరులు పాల్గొని గణేష్‌ను అభినందించారు.

రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘం ఉపాధ్యక్షుడిగా భాస్కర వర్మ



మాడుగుల రూరల్: రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘం ఉపాధ్యక్షుడిగా మాడుగుల మండలం ముకుందపురానికి చెందిన పెమ్మే భాస్కరవర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖలో నిర్వహించిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర వర్మ మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు.

బెంగళూరు-మాల్డా టౌన్ మధ్య స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు-మాల్డాటౌన్-బెంగళూరు మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు-మాల్డా టౌన్(06565) స్పెషల్ రైలు ఎస్ఎంవీ బెంగళూరులో ఈ నెల 13వ తేదీ రాత్రి 11.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6.13 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 6.15 గంటలకు బయలుదేరి మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు మాల్డాటౌన్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో మాల్డా టౌన్-ఎస్ఎంవీ బెంగళూరు(06566) స్పెషల్ ఈ నెల 16వ తేదీ (బుధవారం) సాయంత్రం 4 గంటలకు మాల్డా టౌన్‌లో బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.33 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.35 గంటలకు బయలుదేరి మరుసటిరోజు శుక్రవారం మధ్యాహ్నం 12.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు వెళ్తుంది.

విశాఖ చరిత్రలో 'క్రూయిజ్ టెర్మినల్' ఓ మైలురాయి

- వర్చువల్‌గా కార్డేలియా షిప్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి సోనోవాల్
- రాష్ట్రంలో క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి కృషి చేస్తామని హామీ
- విశాఖ క్రూయిజ్ టెర్మినల్ నుంచి బయలుదేరిన క్రూయిజ్ షిప్



కార్డేలియా షిప్ (ఇన్‌సెట్) వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్



కార్డేలియా షిప్ ఎక్కి అభివాదం చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ భరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ

సాక్షి, విశాఖపట్నం : విశాఖ చరిత్రలో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ఓ మైలురాయి అని కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ అన్నారు. బుధవారం పోర్టు అడ్మినిస్ట్రేటివ్ సమావేశ మందిరంలో కార్డెలియా క్రూయిజ్ షిప్ విశాఖ-చెన్నై సర్వీస్‌ను వర్చువల్ విధానంలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేరుగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, కలెక్టర్ ఎం.హరేందిర ప్రసాద్, పోర్టు చైర్మన్ అంగముత్తు పాల్గొన్నారు. పోర్టు అడ్మినిస్ట్రేషన్ సమావేశం మందిరంలో కార్డెలియా టూరిజం షిప్‌లో ప్రయాణించే కుటుంబాలకు కందుల దుర్గేష్ బోర్డింగ్ పాస్‌లు అందజేశారు. అనంతరం విశాఖ పోర్టులో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌కు చేరుకున్న కార్డెలియా క్రూయిజ్ షిప్‌ను సందర్శించారు. క్రూయిజ్ నౌకలో వసతులు, పర్యాటకులకు అందించే సౌకర్యాలు, ప్రయాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ ఏర్పాటు చేసిన పర్యాటక స్టాళ్లను మంత్రి దుర్గేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. అనంతరం టెర్మినల్ బిల్డింగ్, స్పెషల్ లాంజ్, టూరిజం ఆపరేటర్స్ కౌంటర్స్ తదితర అంశాలను పరిశీలించారు. బుధవారం సాయంత్రం 7.30 గంటలకు విశాఖ నుంచి క్రూయిజ్ షిప్ బయలుదేరింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విశాఖ పోర్టు అథారిటీ అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలో వీలైనంత త్వరగా క్రూయిజ్ టూరిజంను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మట్లాడుతూ విశాఖ పోర్టుకు మరిన్ని క్రూయిజ్ లైనర్లు రావాలని ఆకాంక్షిస్తూ, అందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ ప్రతి 50 కిలోమీటర్లకు ఒక సముద్ర సంబంధిత కేంద్రంగా, షిప్ బిల్డింగ్, స్కిల్ డెవలప్‌మెంట్, కోస్టల్ లేదా క్రూయిజ్ టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రతీ ఏడాది 5,000 మంది విద్యార్థులకు క్రూయిజ్ ఆధారిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పించి, ఉపాధి అవకాశాలకు సిద్ధం చేస్తామని వెల్లడించారు. వర్చువల్ విధానంలో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలరవాణా సహాయ మంత్రి శాంతను ఠాకూర్, కేంద్ర సెక్రటరీ రామచంద్రన్ పాల్గొన్నారు.

రోజంతా వర్షమే

- జిల్లాలో 338.2 వర్షపాతం నమోదు
- పాయకరావు పేటలో అత్యధికంగా 30 మి.మీ.



నీట మునిగిన అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయం

అనకాపల్లి టౌన్ : జిల్లా అంతటా బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా చిరుజల్లులతో వాన కురుస్తూనే ఉంది. దీనివల్ల పాదచారులు, ద్విచక్రవాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు. మొత్తం 338.2 మి.లీ మీటర్లు కురవగా పాయకరావు పేట 30.0, దేవరాపల్లి 28.2, మాడుగుల 26.2 , కె కోటపాడు 25.6 , మాకవరపాలెం 24.6, సబ్బవరం 22.0, నక్కపల్లి 21.4, అనాకాపల్లి 18.2, కోటవురట్ల 16.8, ఎస్ రాయవరం 14.6, చీడికాడ 14.4, చోడవరం13.4, బుచ్చయ్యపేట 12.8, రావికమతం 12.4, రాంబిల్లి9.6, రోలుగుంట 8.8, పరవాడ 8.2, మునగపాక 7.2, నర్సీపట్నం 5.4, అచ్చుతాపురం 5.0, యలయంచిలి 4.6, నాతవరం 3.8, గొలుగొండ 3.2, కోింకోట 1.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులు ఇదే విధంగా చిరు జల్లులు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

కూలిన హైస్కూల్ ప్రహరీ



కూలిన దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిపోయింది. గోడను ఆనుకొని భారీగా మట్టి కుప్పలుగా వేయడంతో పాటు ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గోడ కూలిపోయింది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో నిర్మిస్తున్న బాలికల వసతి గృహానికి సంబంధించిన మట్టిని ప్రహరీకి ఆనుకొని భారీ స్థాయిలో వేయడంతో గోడ బలహీనమై కూలిపోయిందని, ఇది ముమ్మాటికీ అధికార్ల నిర్లక్ష్యమేనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. అధికార్లు తక్షణం స్పందించి ప్రహరీ పునఃనిర్మాణ పనులను చేపట్టాలని వారు కోరారు.

డబుల్ డెక్కర్ బస్ ట్రయల్ రన్

- నగరవాసులకు త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం
- పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్



డబుల్ డెక్కర్ బస్ వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, తదితరులు

అల్లిపురం / కొమ్మాది : విశాఖ నగర ప్రజలు, యాత్రికులకు డబుల్ డెక్కర్ బస్సులు త్వరలో అందుబాటులోకి వస్తాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పేర్కొన్నారు. బుధవారం టూరిజం అభివృద్ధి కార్యక్రమాలపై విశాఖ జిల్లాకు విచ్చేసిన ఆయన సాగర్‌నగర్ బీచ్ వద్ద ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం ప్రాంగణంలో డబుల్ డెక్కర్ బస్సులు, సంబంధిత చార్జింగ్ స్టేషన్‌ను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ జైన్ మాట్లాడుతూ త్వరలో హాఫ్ ఆన్ - హాఫ్ ఆఫ్ పేరుతో డబల్ డెక్కర్ బస్సులు విశాఖ నగరంలో అందుబాటులోకి రానున్నాయన్నారు. అందుబాటులో ఉన్న రెండు డబుల్ డెక్కర్ బస్సులతో ట్రయల్ రన్ నిర్వహించారు. టూరిజం ద్వారా విశాఖ నగరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, టూరిజం శాఖ సంయుక్తంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సౌజన్యంతో వీటిని అందుబాటులోకి తీసుకురానుందని తెలిపారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ విశాఖ నగర ప్రజలు, పర్యాటకుల ఆహ్లాదకర ప్రయాణానికి డబుల్ డెక్కర్ బస్సులు అనువుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి మాధవి, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీర్ పీవీవీ సత్యనారాయణ రాజు, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్ పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గొలుగొండ:కృష్ణదేవి పేటకు చెందిన టి.బాలరాజు అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. బాలరాజు కృష్ణదేవిపేటలో బాబర్‌షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. షాపు వద్దే మంగళవారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు నర్సీపట్నంలో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాలరాజు బుధవారం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. భార్య సాయి సత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పెద్దేరు వంతెనపై ప్రమాదానికి గురైన ఆటో



ప్రమాదానికి గురైన గూడ్సు ఆటో

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది పెద్దేరు వంతెన మీద బుధవారం ఓ గూడ్సు ఆటో ప్రమాదానికి గురైంది. వర్షాల కారణంగా గోతుల్లో నీరు నిలిచిపోయింది. వంతెనవద్ద ఆటో గోతిలో పడి అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. స్థానికులు వెంటనే స్పందించి సహాయకచర్యలు చేపట్టారు. గోతుల కారణంగా ఈ రోడ్డులో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ వంతెన మీదగా భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

- ఎస్పీ తుహిన్ సిన్హా



పోలీస్ ఉద్యోగుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, ప్రశంసాపత్రాలు అందజేసిన ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: విద్యార్థి దశనుంచి ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, తద్వారా ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. ఈ ఏడాది టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పోలీస్ సిబ్బంది పిల్లలకు బుధవారం స్కాలర్ షిప్‌లు, ప్రశంసాపత్రాలు అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది పిల్లల ఉన్నత చదువులకు తన వంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలో 26 మంది విద్యార్థినీవిద్యార్థులకు రూ. 1.30 లక్షల నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు బాల సూర్యారావు, రమేష్, రామకృష్ణ, పోలీస్ అసోసియేషన్ అడహక్ అధ్యక్షుడు సీసీఎస్ సీఐ అప్పలనాయుడు, కోశాధికారి లలిత, సభ్యులు మొహిద్దీన్, అచ్చయ్య, భూలోక, సత్యనారాయణ, మల్లీశ్వరి, శేషాద్రి, రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘ సభ్యుడు, ఎస్ఐ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ దేముడుబాబుకు అరుదైన పురస్కారం



కేంద్ర మంత్రి నడ్డా చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న డాక్టర్ దేముడుబాబు



బెస్ట్ న్యూరో ఫిజిషియన్ అవార్డు గ్రహీత దేముడు బాబును సత్కరిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

- బెస్ట్ న్యూరో ఫిజీషియన్‌గా ఢిల్లీలో అవార్డు స్వీకారం

దేవరాపల్లి: మండలంలో కాశీపురానికి చెందిన ప్రముఖ న్యూరో ఫిజీషియన్ బొడ్డు దేముడుబాబుకు అరుదైన గౌరవం దక్కింది. దేశంలో ప్రసిద్ధిగాంచిన టైమ్స్ గ్రూప్ ఆఫ్ ఇండియా జాతీయ మీడియా సంస్థ దేశ వ్యాప్తంగా ఉత్తమ సేవలందిస్తున్న ప్రముఖ వైద్యులను ఎంపిక చేసింది. డాక్టర్స్ డే సందర్భంగా వారందర్నీ దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి విశాఖలో ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్ దేముడుబాబు ఒక్కరికే ఈ అరుదైన పురస్కారం లభించింది. కేంద్ర మంత్రి జె.పి నడ్డా చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. అవార్డు అందుకున్న దేముడుబాబును కాశీపురంలో బుధవారం స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఓ మారుమూల ప్రాంతంలో జన్మించి దేశంలోనే గొప్ప న్యూరో ఫిజియన్‌గా గుర్తింపు తెచ్చుకోవడంతో కాశీపురం గ్రామస్తులతో పాటు ఉమ్మడి విశాఖలోని సన్నిహితులు, కుటుంబ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి గొప్ప వైద్యుడిగా అరుదైన అవార్డు పొందడం తమ గ్రామానికి గర్వకారణమని కాశీపురం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

వినియోగదారుల అవసరాలే వ్యాపార అభివృద్ధికి కీలకం



సదస్సును ప్రారంభిస్తున్న కుమార్ రాజగోపాలన్, మావూరి వెంకట రమణ, కంకటాల మల్లికార్జునరావు

- ఆర్ఏఐ సీఈవో కుమార్ రాజగోపాలన్

ఏయూ క్యాంపస్: వినియోగదారుడి అవసరాలు తెలుసుకుంటేనే వ్యాపార అభివృద్ధి సాధ్యపడుతుందని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఆర్ఏఐ) సీఈవో కుమార్ రాజగోపాలన్ అన్నారు. బుధవారం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన విశాఖపట్నం రిటైల్ సమ్మిట్‌ను సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ, కంకటాల సంస్థల అధినేత కంకటాల మల్లికార్జునరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార్ రాజగోపాలన్ మాట్లాడుతూ నేటితరం రిటైల్ మార్కెటింగ్‌లో వేగం, కచ్చితత్వం ప్రధానంగా మారాయన్నారు. సృజనాత్మకంగా ఉంటూ తమ బ్రాండ్‌ను నిలుపుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. భారత ఆర్థిక వ్యవస్థపై రిటైల్ రంగం ఎంతో ప్రభావాన్ని చూపుతుందని, ఉపాధి కల్పనతో పాటు జీడీపీ వృద్ధికి దోహదపడుతోందన్నారు. మావూరి వెంకట రమణ మాట్లాడుతూ కలసి ప్రయాణించడం, ఆలోచనలను పంచుకోవడం ఎంతో అవసరమన్నారు. కంకటాల మల్లికార్జునరావు మాట్లాడుతూ రిటైల్ వ్యాపారాన్ని ఆస్వాదించే దృక్పథం ఉంటేనే కొనసాగాలన్నారు. మన కష్టాన్ని పెట్టాలని, ఫలితం వెంటనే ఆశించడం సరికాదన్నారు. సంస్థలో పనిచేసే ఉద్యోగులపై నమ్మకం ఉంచడం, వారి ఆత్మస్థైర్యాన్ని రెట్టింపు చేస్తూ, వారిలోని లోపాలను రూపు మాపే ప్రయత్నం చేయాలన్నారు. వినియోగదారుడితో మసలుకునే విధానం, వారితో సంభాషించే విధానం వ్యాపారాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తాయన్నారు. నాలుగు దశాబ్దాలుగా రిటైల్ వ్యాపార రంగంలో తాను స్వయంగా తెలుసుకున్న అనేక సూత్రాలను, నైపుణ్యాలను వివరించారు.

తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ రంగం అభివృద్ధి

హైదరాబాద్ ఆర్ఏఐ ప్రాంతీయ శాఖ చైర్మన్ అవినాష్ ఆనంద్ మాట్లాడుతూ దక్షిణాదిలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ రంగం ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధిస్తోందన్నారు. అంతర్జాతీయ బ్రాండ్‌లు సైతం భారత్‌కి రావడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఆగస్టు 6న హైదరాబాద్‌లో ఆర్ఏఐ సమ్మిట్ జరుగుతుందని, అందరూ పాల్గొనాలని ఆహ్వానించారు. విశాఖ వేదికగా రిటైల్ రంగానికి ఆశాజనకంగా ఉంటుందన్నారు. అనంతరం నిర్వహించిన చర్చావేదికలో భవిష్యత్తులో వినియోగదారుల వస్తు ప్రభావం అనే అంశంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మెట్రో నగరాలతో పాటు ఇక్కడి పరిస్థితులను, అవకాశాలను వివరించారు. టైర్-2, టైర్-3 నగరాల్లో వస్తున్న మార్పులపై చర్చించారు.

5 నుంచి తుది విడత చందనం అరగదీత

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఈ నెల 5 నుంచి తుది(4వ) విడత చందనం అరగదీతను ప్రారంభించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు బుధవారం చందనం చెక్కలను అరగదీతకు అనువుగా ఉద్యోగి సాంబ ముక్కలుగా కోశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 10న ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఆ రోజు స్వామికి తుది విడతగా మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనం సమర్పిస్తారు. ఆ చందనాన్ని సమకూర్చేందుకు అరగదీతను చేపట్టనున్నారు.

ప్రయాణం.. నరకప్రాయం



మట్టిరోడ్డును తలపిస్తున్న తాండవ వెళ్లే తారురోడ్డు



రోడ్డు మధ్య గోతిలో ఉన్న వర్షం నీరు

- అడుగుకో గుంతతో అధ్వానంగా నాతవరం-తాండవ రోడ్డు
- అవస్థలు పడుతున్న మూడు మండలాల ప్రయాణికులు

అడుగడుగునా గోతులు.. కనుచూపు మేర కనిపించని తారు..చిన్నపాటి వర్షానికే దమ్ము చేసే పొలంలా ఉండే దారి వెరసి తాండవ- నాతవరం రహదారి. ఈ రోడ్డులో ప్రయాణం ప్రమాద భరితంగా మారింది. ఈ దారిలో ప్రమాణమంటేనే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు.

నాతవరం: మండల కేంద్రం నాతవరం నుంచి తాండవ రిజర్వాయర్ వరకు గల, రెండు జిల్లాలను అనుసంధానం చేస్తూ ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. ఫలితంగా అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కేవలం ఎనిమిది కిలోమీటర్ల ఈ రోడ్డులో అడుగడుగునా ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. ఏ మాత్రం వర్షం పడినా నీరంతా గోతుల్లోకి చేరడంతో ఎక్కడ రోడ్డు ఉందో, ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.ఈ తారు రోడ్డు పూర్తిగా శిథిలమై మట్టి రోడ్డును తలపిస్తోంది. ఇది అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలానికి అనుసంధానం చేసే ప్రధాన రోడ్డు . నాతవరం, గొలుగొండ, కొయ్యూరు మండలాలను కలిపే ఈరోడ్డుపై మూడు మండలాల పరిధిలో సుమారు 25పైగా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లాలో ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయర్‌కు వెళ్లేందుకు ఈరోడ్డే కీలకం. రిజర్వాయర్‌ను సందర్శించేందుకు వచ్చిన వారితో పాటు పలు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రోడ్డు అధ్వానంగా తయారవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

రాత్రి వేళ ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు శిథిలం కావడంతో ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనదారులు ఈ ప్రాంతంలో గ్రామాలకు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఈచుట్టు పక్కల గ్రామాల్లో విద్యార్థులు కాలేజీలకు వెళ్లడానికి అవస్థలకు గురవుతున్నారు. రోడ్డుకు కనీస స్థాయిలో మరమ్మతులు చేయకపోతే ఆర్టీసీ సర్వీసును నిలిపివేస్తామని అధికారులు చెబుతున్నారు. గోతుల కారణంగా అత్యవసర సరీసులైన 108 వాహనం , ఇతర ప్రైవేటు అంబులెన్స్‌లు సైతం ఈ గ్రామాలకు సరిగా రావడం లేదు.

వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి



తాండవ- నాతవరం రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నాం. మా గ్రామాలకు ప్రైవేటు వాహనాలు రావడం లేదు. ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రోడ్డు అధ్వానంగా ఉండడంతో వైద్యం కోసం ఆస్పత్రి వెళ్లే వృద్ధులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.వర్షం పడితే రోడ్డంతా బురదమయంగా తయారైన రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉంది.

– వై.సందీప్, పీజీ విద్యార్థి, చమ్మచింత గ్రామం

ఆందోళన చేస్తాం



తాండవ రిజర్వాయర్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రాకపోకలు సాగించడానికి పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలి. లేకపోతే మండల కేంద్రంలో కార్యాలయాల వద్ద ఆందోళనలు చేస్తాం.

–అంకంరెడ్డి చిన్నంనాయుడు, సీపీఐ మండల కార్యదర్శి

క్లుప్తంగా

విద్యుత్ సరఫరా బంద్ రేపు

అనకాపల్లి: విద్యుత్‌శాఖ డి–1 సెక్షన్ 11కేవీ విజయరామరాజుపేట ఫీడర్ పరిధిలో కొత్త లైన్లు, ఏబీ స్విచ్‌ల ఏర్పాటు కోసం ఈనెల 4వ తేదీ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ(ఆపరేషన్ డివిజన్) కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ విజయరామరాజుపేట ఫీడర్ పరిధిలో శ్రీరామ్‌నగర్, విజయరామరాజుపేట, గాంధీనగర్, మిరియాల కాలనీ, గుండా జంక్షన్, అంజయ్యకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

నేడు రోటరీ సమావేశం

అనకాపల్లి: స్థానిక న్యూకాలనీ తాటికొండ నూకయ్యశెట్టి మెమోరియల్ రోటరీ హాల్లో గురువారం నియోజకవర్గ రోటరీ సమావేశం నిర్వహించనున్నట్టు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఉంటుందని, క్లబ్ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ప్రత్యేక బస్సు నడపాలని వినతి



ప్రజా రవాణా అధికారి ప్రవీణకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయికులు

అనకాపల్లి టౌన్: మండలంలోని రేబాక పాలిటెక్నిక్ కళాశాలకు ప్రత్యేక బస్సు నడపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కోరారు. స్థానిక ప్రజారవాణాశాఖ కార్యాలయంలో జిల్లా ప్రజా రవాణా అధికారి బి.ప్రవీణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ప్రాంతాల నుంచి అనకాపల్లి కాంప్లెక్స్‌కు బస్సుల్లో వస్తున్న విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లేందుకు తగిన బస్సు సౌకర్యం లేక ఆటోలను ఆశ్రయించి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రేబాక పాలిటెక్నిక్ కళాశాలకు ప్రత్యేక బస్ నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు రాజు, జగదీష్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

యోగా గురువులకు కనీస వేతనాలివ్వాలి



మారేడు మొక్కలను పంపిణీ చేస్తున్న యోగా గురువులు

అనకాపల్లి టౌన్: రాష్ట్రంలోని ఆయుర్వేద ఆస్పత్రుల్లో పనిచేస్తున్న యోగా గురువులకు కనీస వేతనాలు అమలు చేయాలని యోగా గురువు ఆర్.శ్రీను కోరారు. జిల్లాలోని వివిధ ఆయుర్వేద ఆస్పత్రుల్లో పనిచేస్తున్న యోగా గురువుల సమావేశం మండలంలోని కొత్తూరు శారదానగర్‌లో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా అతి తక్కువ గౌరవ వేతనాలతో సేవలందిస్తున్నామని, తమ సేవలను గుర్తించి గౌరవ వేతనాలు పెంచాలన్నారు. ఈ సందర్భంగా మారేడు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో యోగా గురువులు దవరసింగి రాంబాబు, ఏవీఎస్ త్రినాథ్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 31 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	----	----
మూడో రకం	3,190	3,190

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	:8 వసంతాలు
పర్తిసాయి	:కుబేరా
షిర్డీసాయి	: సితారే జమీన్ పర్
వెంకటేశ్వర	:చంద్రేశ్వర
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: మార్గన్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 13 యూనిట్లు, బి పాజిటివ్ -9 యూనిట్లు, ఒ పాజిటివ్ -29 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ య.లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 311 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 249 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి(ఫోన్ నంబర్ 08924-223595)ని సంప్రదించవచ్చు.

పల్లె దారుల్లో ముసురుకున్న కష్టాలు

- అధ్వానంగా ప్రధాన రోడ్లు
- వానలకు మరింత దారుణంగా మారిన వైనం
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన వర్షంనీరు
- గుంతల రోడ్లపై రాకపోకలకు ప్రయాణికుల ఇక్కట్లు

కశింకోట మండలంలోని పలు రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇప్పటికే అడుగుకో గొయ్యితో ఉన్న రహదారులు రెండు రోజుల నుంచి ముసురుపట్టి కురుస్తున్న వర్షాల కారణంగా మరింత అధ్వానంగా తయారై, చెరువులను తలపిస్తున్నాయి. రహదారులపై నీరు నిలిచిపోవడంతో గోతులు కనిపించక వాటిలో పడి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చాలా గ్రామాల్లో రోడ్లపై నిలిచిపోయిన మురుగునీటిలో రాకపోకలు సాగించవలసి వస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రోడ్ల పరిస్థితిపై తీవ్ర ఆరోపణలు గుప్పించిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఉగ్గినపాలెం రోడ్డు గోతుల్లో నిలిచిన వర్షం నీరు



తాళ్లపాలెం హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో కాలువ పూడుకుపోవడంతో జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షం నీరు



తాళ్లపాలెం సంత వద్ద గోతుల్లో నీరు నిల్వ ఉండిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు

కశింకోట: మండలంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. వర్షం పడిన ప్రతి సారి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అల్ప పీడన ప్రభావంతో మంగళ, బుధవారాలు వర్షాలు కురవడంతో కశింకోట, తదితర గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా మారాయి. తాళ్లపాలెం కూడలి నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్డు కూడలి, రామాలయం సమీపం, బంగారయ్యపేట బంకు వద్ద, తాళ్లపాలెం సంత ప్రాంతాల్లో పెద్ద గుంతలు పడ్డాయి. నర్సీపట్నం ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి అచ్చెర్ల గ్రామానికి వెళ్లే రోడ్డు, కన్నూరుపాలెం నుంచి తీడ వెళ్లే రోడ్డు, జాతీయ రహదారి నుంచి ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్లపై గతంలో పడిన గోతుల్లో వర్షం నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. తాళ్లపాలెం హైస్కూలుకు వెళ్లే మార్గంలో గల జాతీయ రహదారి కాలువ చెత్తా చెదారంతో మూసుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో విద్యార్థులు, స్థానిక ప్రజలు మురికి నీటిలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. బయ్యవరం వద్ద జాతీయ రహదారికి ఇరు వైపులా ఉన్న కాలువలు పూడుకు పోవడంతో నీరు రోడ్డు పక్కన నిలిచిపోతోంది. దీంతో వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కశింకోటలో స్టేట్ బ్యాంక్ వద్ద కాలువలు లేక రోడ్డుపైనే నీరు నిలిచిపోయింది. ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు, ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. గవరపేట, కస్పా వీధి, పూసర్ల వీధి, ఉప్పునీటి దిబ్బ, రౌతువీధి, వడ్డి వీధి తదితర ప్రాంతాల్లోని రోడ్లు చిత్తడిగా మారాయి.



తాళ్లపాలెం రామాలయం సమీపంలో గతుకులతో ఉన్న నర్సీపట్నం రోడ్డు



అచ్చెర్ల రోడ్డులో..

ప్రమాదకరంగా రోడ్లు



తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం రోడ్డు, అచ్చెర్ల రోడ్డు గోతు లతో ప్రమాదకరంగా ఉన్నాయి. ఏ మాత్రం వర్షం పడినా వాటిలో నీరు చేరుతోంది. దీంతో గోతులు కనిపించక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గోతుల్లో ఆటోలు పడి మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలి.

– ఎం. శ్రీను, ఆటో డ్రైవర్, తాళ్లపాలెం.

రాకపోకలకు తప్పని ఇబ్బందులు



తాళ్లపాలెం హైస్కూలుకు వెళ్లే రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయింది. రాకపోకలు సాగించడానికి విద్యార్థులు, పొలాలకు వెళ్లే రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి కాలువ పూడుకుపోవడం వల్ల నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. వర్షం పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఉండడంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– కరణం రమణాజీ, తాళ్లపాలెం

కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను ఎమ్మెల్యే దూషించడం అన్యాయం



వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణను పరామర్శిస్తున్న బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

తుమ్మపాల: బీసీ మహిళా ఉద్యోగి, కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణను చోడవరం ఎమ్మెల్యే తీవ్రపదజాలంతో దూషించడం అన్యాయమని జిల్లా బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొణతాల గణేష్, రాష్ట్ర సబ్‌కమిటీ మెంబర్ పినిశెట్టి జగదీశ్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఉమామహేశ్వరి అన్నారు. మండలంలో కొత్తూరు పంచాయతీ శారదానగర్‌లో నివాసముంటున్న వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ కోసూరి అన్నపూర్ణను బుధవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డాది కేజీబీవీలో ప్రభుత్వ నిబంధనల మేరకు కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న అన్నపూర్ణపై ఒక అడ్మిషన్ విషయంలో అందరి ముందు పరుష పదజాలంతో ఎమ్మెల్యే, ఆయన అనుచరులు తీవ్రంగా నిందించడంతో ఆమె మానసిక ఒత్తిడికి గురై ఆస్పత్రి పాలు కావలసి వచ్చిందని చెప్పారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా విద్యాశాఖ మంత్రి, ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ నరసయ్యనాయుడు, రమాదేవి పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో రంగాచారి, శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు

తుమ్మపాల: ఖరీఫ్‌లో రైతులందరూ ఆధునిక వ్యవసాయ యజమాని పద్ధతులు పాటించడం ద్వారా దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి పి.రంగారావు అన్నారు. తుమ్మపాలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న రాయితీలు, పథకాలను అర్హులైన ప్రతి రైతుకు అందిస్తామని చెప్పారు. సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని కోరారు. ఆధునిక వ్యవసాయ యాంత్రిక పద్ధతులపై రైతులందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. పిల్లి పెసర, జనుము, జీలుగా వంటి పచ్చిరొట్ట పంటలు ముందుగా వేసేకోవాలని తెలిపారు. వరి విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుందని వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దాడి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వరి పండించే రైతులు యూరియా తగ్గించి పొటాష్ వంటి ఎరువులను వాడాలని సూచించారు. జీవన ఎరువుల వినియోగం వల్ల భూమి సారం పెరుగుతుందని చెప్పారు.

వరి వేసే ప్రతి రైతు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ (ఏటీఎంఏ) అధికారి పి.రామకష్ణ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ప్రవీణ, సురేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు లలిత, రైతు నాయకులు పి.విశ్వేశ్వరరావు, పీలా తాతనాయుడు, పీలా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వంగలి గ్రామాభివృద్ధికి 'పెట్రో వర్సిటీ' చొరవ



పాఠశాలకు అందించిన కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న శాలివాహన, తదితరులు

సబ్బవరం: స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా విద్య, వైద్యంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ డైరెక్టర్ శాలివాహన అన్నారు. మండలంలోని వంగలిలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా వర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. వంగలి గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 1 నుంచి 15 వరకు ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని ఎంపీపీ స్కూల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు, బాలికా విద్య ప్రోత్సాహానికి పెద్దపీట వేయనున్నట్లు వెల్లడించారు. పాఠశాలకు ఓ కంప్యూటర్, క్రీడా సామగ్రిని అందించారు. గ్రామంలో పారిశుధ్య కార్మికులను సత్కరించి, ప్రోత్సాహక బహుమతులు అందించారు. పాఠశాల ఆవరణంలో డైరెక్టర్ చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా గ్రామంలోని రామాలయం వద్ద కేర్ హాస్పిటల్, వాసన్ ఐ కేర్ సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో పెట్రో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీరాంపాల్ త్రివేది, జాయింట్ రిజిస్ట్రార్, కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మురళీకృష్ణ, ఎంఈవో రవీంద్రబాబు, హెచ్‌ఎం మాధవి, గ్రామ పెద్దలు ఆకుల గణేష్, గవర రాజు, జెట్టి హేమంత్, యర్ర సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఎండీఎం కార్మికులకు కనీస వేతనాలివ్వాలి'



డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పరవాడ: మధ్యాహ్న భోజన(ఎండీఎం) కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఎండీఎం కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. పరవాడలో కార్మికులతో కలిసి బుధవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆకాశాన్ని అంటిన నిత్యావసర ధరలతో పోలిస్తే ప్రభుత్వం ఇస్తున్న వేతనం ఎందుకూ సరిపోవట్లేదన్నారు. పథకం కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు సరిపోక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ నెల 1వ తేదీకి బిల్లులు చెల్లించి, జీతంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎండీఎం కార్మికులు కె.ఆదిలక్ష్మి, గండి లక్ష్మి, నాగమణి, నూకరత్నం, లక్ష్మి, నూకాలమ్మ, రత్న కుమారి, పార్వతి, రత్నం పాల్గొన్నారు.

కొత్త మోటార్ వెహికల్ చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్: కొత్త మోటార్ వాహనాల చట్టం ప్రకారం హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే రూ.1000 జరిమానా విధించనున్నట్టు పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. కొత్తమోటార్ వెహికల్ చట్టంపై ద్విచక్ర వాహనదారులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే మెదటి సారి రూ.రెండు వేలు, రెండవ సారి రూ.నాలుగు వేలు జరిమానా, లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.ఐదు వేలు, హెవీ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.పది వేలు జరిమానా విధిస్తామని సీఐ తెలిపారు.

ఉపాధి కూలీలకు రెయిన్ కోట్లు పంపిణీ




కూలీలకు రెయిన్ కోట్లు అందిస్తున్న రామరాజు

ఎస్.రాయవరం: గుర్రాజుపేట గ్రామంలో ఉపాధి కూలీలకు గ్రామానికి చెందిన స్థానిక నాయకుడు రామరాజు రైయిన్ కోట్లు బుధవారం పంపిణీ చేశారు. ఉపాధి కూలీలు ఎండా, వానా లెక్క చేయకుండా పనులు చేస్తుంటారని, వారికి రెయిన్ కోట్లు ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు గ్రామంలో ఉన్న 300 మంది ఉపాధి కూలీలకు వీటిని అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కురందాసు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అనధికార మద్యం విక్రయాలపై సమాచారమివ్వాలి

తుమ్మపాల: అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వారి వివరాలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి సుధీర్ ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని తెలిపారు. వివాహాలు, పార్టీలు, ఇతర సామూహిక వేడుకల్లో మద్యాన్ని తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని చెబుతూ కొందరు వ్యక్తులు కల్తీ మద్యంతో మోసం చేస్తున్నారని తెలిపారు. కల్తీ మద్యం వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని పేర్కొన్నారు. అనధికార మద్యం విక్రయదారులపై టోల్ ఫ్రీ నంబర్: 14405, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఫోన్ నంబర్ల(9440902383, 7702278287)కు తెలియజేయాలని తెలిపారు.

'పారదర్శకంగా సామాజిక తనిఖీ'



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ హాలులో బుధవారం సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. అయితే సామాజిక తనిఖీ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పథకం నిర్వహణలో అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. సామాజిక తనిఖీ సమన్వయ కమిటీ సభ్యులు బాధ్యతగా సేవలందించాలన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీవో శివ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న వైద్యుడు వెంకట సత్యనారాయణ

అనకాపల్లి: దివ్యాంగులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వైద్యుడు గండి వెంకట సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సత్యసాయిబాబా మందిర వీధి ఆస్పత్రిలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం, రూరల్ డవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఇద్దరు దివ్యాంగులకు వీల్ చైర్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదలతో చదివిన దివ్యాంగులు నేడు ఐఏఎస్‌లుగా మన దేశంలో ఉన్నత శిఖరాలు అధిరోహించారని తెలిపారు. నిరుపేద దివ్యాంగులకు వైద్యపరంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్, రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ సంస్థ కార్యదర్శి గాడి శ్రీను, సంఘం కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, లబ్దిదారులు కొల్లి జ్యోతి, సక్కా తారకరామ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా గల ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలను మెరుగుపరచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర డిమాండ్ చేశారు. స్థానిక కొడగంటి గోవిందరావు భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాయకరావుపేటలోనిబీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన హోంమంత్రి అనిత భోజనంలో నాణ్యత లేదని వార్డెన్‌ను సస్పెండ్ చేయడం హర్షించదగ్గ విషయమేనని, అందుకు కారణాలను లోతుగా విశ్లేషించి, సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు సరైన భోజన, వసతి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపరచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సహకార బ్యాంకుల రుణాలు



డ్వాక్రా సభ్యులకు చెక్కు అందజేస్తున్న కోన తాతారావు

అనకాపల్లి: సహకార బ్యాంకుల ద్వారా అర్హులందరికీ రుణాలు మంజూరు చేయనున్నట్టు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ కోన తాతారావు తెలిపారు. అంతర్జాతీయ సహకార సంస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ వాణిజ్య బ్యాంకు ఇంతవరకూ ఇవ్వని విధంగా సహకార బ్యాంకు ద్వారా ఒక్కో ఎకరానికి రూ. 5 లక్షల వరకు రుణం అందిస్తునట్టు చెప్పారు. డ్వాక్రా గ్రూపులకు ప్రాసెసింగ్ చార్జీలులేకుండా తక్కువ వడ్డీ రేటుతో రూ.20 లక్షల వరకు రుణాలు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.వి.ఎస్. వర్మ, నాబార్డ్ డీడీఎం సమత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

సబ్బవరం: మండలంలోని గొటివాడ ప్రాథమిక పాఠశాలను అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు బుధవారం సందర్శించారు. విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల సమస్యలు, మౌలిక వసతుల కల్పన వంటివాటిపై విద్యార్థులను ఆరా తీశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగు పరిచేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రార్థనా సమయానికి వచ్చిన ఆయన, విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. స్కూల్ హెచ్‌ఎం పీవీ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.